

అప్రమత్తతే 'శ్రీరామ' రక్ష..
సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం రామమందిర అంశాన్ని వినియోగించుకుంటున్నారు. నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.
- 8లో▸



క్రీడలతో మానసిక ఉత్తేజం
బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తున్న కార్మికులకు క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ పరిస్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉండి, సాయంత్రం నుంచి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

'నవోదయ' పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో వివరాలు వెల్లడించారు. వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వరంగల్, వర్ధన్నపేట మండల పరిధిలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీహెచ్‌ఎస్ మోడల్ హైస్కూల్ నర్సంపేట, జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్, జెడ్పీ హైస్కూల్ (బాలికలు) నర్సంపేట, మట్టెవాడ, నరేంద్రనగర్, వరంగల్, శంభునిపేట, రంగశాయి పేట, గిర్మాజీపేట, వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మరియపురం స్వచ్ఛతకు ప్రశంసలు..!
గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం 'పరిశుభ్రత.. ఆరోగ్యం' విషయంలో సాధించిన విజయాలు.. ప్రశంసలను అందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలు 'హెల్తీ విలేజ్' అనే అంశంపై ఈ నెల 18నుంచి 20 వరకు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో 30 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరు కాగా.. మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ఎంపికయ్యారు. సదస్సులో గురువారం పరిశుభ్రత, ఆరోగ్యం విషయంలో మరియపురంలో చేపడుతున్న చర్యల గురించి వీడియోను ప్రదర్శించారు. అనంతరం సర్పంచ్ బాలిరెడ్డి తమ గ్రామంలో చేపడుతున్న చర్యలను సదస్సులో వివరించారు.

వాటర్ ప్లాంట్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లిలో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో ఉత్తమ వాటర్ ప్లాంట్‌గా ఎంపికైంది. ఈమేరకు గురువారం కాజీపేటలో నిర్వహించిన మూడు రాష్ట్రాల సదస్సులో బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా చేతుల మీదుగా నిర్వాహకులు అవార్డు అందుకున్నారు. మూడు రాష్ట్రాల పరిధిలో 1500 వాటర్‌ప్లాంట్‌లు నిర్వహిస్తుండగా నాచినపల్లి ఉత్తమ ప్లాంట్‌గా ఎంపిక కావడంతో గ్రామంలో సంబరాలు నిర్వహించారు. పాలకవర్గ సభ్యులను సర్పంచ్ పెండ్యాల మమత, ఎంపీటీసీ నాగరబోయిన మమత, ఉప సర్పంచ్ జంగా రాజిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, ప్లాంట్ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, కన్నెబోయిన చంద్రమౌళి, కందకట్ల రఘుపతి, తప్పెట లక్ష్మీనారాయణ, బండారి ఉప్పలయ్య, మెతుకుపల్లి రవీందర్, చెన్నూరి నర్సింహారెడ్డి, బాబర్, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలి
సంగెం: గ్రామాల అభివృద్ధితోపాటుగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలని డీఆర్‌డీఓ సంపత్‌రావు అన్నారు. గురువారం సంగెం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ)పై మండలస్థాయిలో నిర్వహించిన అవగాహన సమావేశంలో సంపత్‌రావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, ప్రజలను భాగస్వాములను చేసి అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పొందుపరచాలన్నారు. పనులను ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం మండల ప్రణాళికలు రుపొందించాలని సూచించారు.

గైర్హాజరైన ప్రజాప్రతినిధులు..
అవగాహన సమావేశానికి 33 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉండగా.. కేవలం సంగెం, నల్లబెల్లి సర్పంచ్‌లు, సంగెం, తీగరాజుపల్లి, తిమ్మాపూర్, కుంటపల్లి ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. నార్లవాయి సర్పంచ్ భర్త, ఎల్గూర్‌రంగంపేట ఎంపీటీసీ భర్త హాజరు కావడం గమనార్హం. మిగిలిన ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో గ్రామాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న గ్యారంటీలు!

ఆశలపల్లకీలో అర్హులైన ఆశావహులు..
- ఆన్‌లైన్‌లో 'ప్రజాపాలన' దరఖాస్తులు
- వివిధ పథకాలకు ఉమ్మడి వరంగల్‌లో 14.16 లక్షల అర్జీలు
- గ్యారంటీల కోసం లబ్ధిదారుల వెయిటింగ్..

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వ ఐదు గ్యారంటీలు అర్హులైన లబ్ధిదారులను ఊరిస్తున్నాయి. దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తరుణంలో ఆ పథకాలపై గంపెడాశలు పెట్టుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. ఐదు గ్యారంటీలు కాకుండా ఇతరత్రా పథకాల్లో లబ్ధికి తెల్ల కాగితం, ప్రింట్ పేపర్లలో కూడా విజ్ఞప్తులు అందాయి. గ్యారంటీలు కాకుండా ఇతర అంశాలపైన కూడా చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు మాత్రం గ్యారంటీల దరఖాస్తులను మాత్రమే నమోదు చేసినట్లు చెబుతున్నారు. ఇతర పథకాల కోసం అందిన వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి జాబితాలో పక్కన పెట్టామంటున్నారు.

ముగిసిన వడబోత.. ఆన్‌లైన్‌లో భద్రం...
ఎన్నికల హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గట్టే జిల్లా కలెక్టర్లకు, అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఒకదాని తర్వాత ఒకటి పథకాలను అమలు చేసుకుంటూ వస్తున్న ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల విషయంలోనే శ్రద్ధ పెట్టి డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరించింది. ఈ నెల 17లోగా మొత్తం డేటా ఎంట్రీ అయిపోయే విధంగా 4, 5 తేదీల్లోనే అధికారులకు, కలెక్టర్లకు శిక్షణ ఇచ్చారు. 6వ తేదీన ప్రజావాణి ముగిసిన వెంటనే దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మండల కేంద్రాల్లో చేపట్టారు.



ఆత్మకూరు మండలంలో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు(ఫైల్)

మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో డీటీపీ ఆపరేటర్ల సేవలు వినియోగించుకుంటూ డేటా ఎంట్రీ చేపట్టారు. రైతులు, రైతుకూలీలు, కౌలు రైతులు, 200 యూనిట్ల విద్యుత్, మహిళలకు రూ.2,500, ఉద్యమకారులకు 250 గజాల స్థలం, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ కోసం తదితర దరఖాస్తులను వడబోసి ఆన్‌లైన్‌లో భద్రపరచగా.. ఆశావహులు ఆ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల వివరాలు ఇలా..

జిల్లా	5 గ్యారంటీలకు...	ఇతర స్కీంలకు
హనుమకొండ	2,47,440	42,996
వరంగల్	2,90,011	60,012
ములుగు	98,320	12,021
జేఎస్ భూపాలపల్లి	1,32,110	14,035
జనగామ	1,79,125	30,115
మహబూబాబాద్	2,44,506	65,114

పోటెత్తిన దరఖాస్తులు..
ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఐదు గ్యారంటీల కోసం 11,91,512 దరఖాస్తులు రాగా, 2,24,293 మంది ఇతర దరఖాస్తులు సమర్పించారు. ఈ రెండు రకాల దరఖాస్తులు కలిపి మొత్తం 14,15,805 వచ్చాయి. ఆరు జిల్లాల్లో ఇప్పటికే 90 శాతం వివరాలు ప్రజాపాలన వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రక్రియ పూర్తి చేసి ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తుదారుల వివరాలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇతర పథకాల్లో అత్యధికంగా రేషన్ కార్డు, రెండు పడక గదుల ఇళ్లు, బీసీ బంధు, దళితబంధు తదితరాలకు దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్న అధికారులు.. వాటిని పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీల్లోనే భద్రపర్చారంటున్నారు. ఇంకొందరు కార్యదర్శులు వాటిని ఆయా ఎంపీడీఓ కార్యాలయాలకు పంపించారు. వాటి వివరాలను నమోదు చేసే అవకాశం లేకపోవడంతోనే ఇలా చేశామని వారు చెబుతున్నారు.

మహాలక్ష్మి పథకాన్ని అందించాలి



అరు గ్యారంటీ పథకాల్లో మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నా. ప్రతి నెలా రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం ఎదురుచూస్తున్నా. ఈ పథకాన్ని వెంటనే అమల్లోకి తెచ్చి మహిళలకు ఆర్థిక చేయూత అందించాలి.
– బొలుగొడ్డు రజిత, తూర్పుకోట

వృద్ధాప్య పింఛన్లు పెంచాలి



నాకు 60ఏళ్ల పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రటించిన రూ.4వేల పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నా. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. గత ప్రభుత్వంలో పింఛన్ రాలేదు. ప్రభుత్వ అందించే చేయూత కోసం ఎదురుచూస్తున్నా.
– పిట్ట రవీందర్ శాంతినగర్

పథకాలు త్వరగా అమలు చేయాలే..



మాది నిరుపేద కుటుంబం ఇంటి కోసం, రూ.2,500 పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఆ పథకాలు ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వీలైనంత తొందరగా అమలు చేయాలి.
– సబ్బని రమ్య, గృహిణి, కమలాపూర్

పదవీ కాలం ముగుస్తున్నందుకేనా..?
- జీపీడీపీ సమావేశానికి గైర్హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- ప్రశ్నార్థకంగా గ్రామాల అభివృద్ధి
- డీపీఓ హాజరైనా పట్టించుకోని స్థానిక ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ కల్పన

చెన్నారావుపేట: గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీల పాత్ర కీలకం. ఈక్రమంలో గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలు, అమలు చేసే ప్రభుత్వ పథకాలపై నిర్వహించే ఏ సమావేశానికైనా వీరు తప్పక హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయడంతోపాటు, అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించే అవసరం ఉంటుంది. కానీ, గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన జీపీడీపీ(గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) అవగాహన సదస్సుకు మండల వ్యాప్తంగా సుమారు 30మంది సర్పంచులకు గాను కేవలం పుల్లయ్యబోడు సర్పంచ్ బోడ సమ్మునాయక్ మాత్రమే హాజరు కావడం గమనార్హం. అయితే పదవీ కాలం ముగిస్తుండడంతో గ్రామ అభివృద్ధిపై మాకేంటి అనే అభిప్రాయంతోనే వారు సమావేశానికి రాలేదేమోనని పలువురు భావిస్తున్నారు. పదవీ కాలం ముగిసినా.. గ్రామ పౌరులుగా.. ఐదేళ్లు అధికారంలో ఉన్న వారిగా గ్రామ అభివృద్ధిపై ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ సదస్సుకు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. సర్పంచ్‌లు పలువురు ప్రజాప్రతినిధులు వస్తారని వేచిఉన్న అధికారులు 12గంటల తర్వాత సమావేశాన్ని ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలి
గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని డీపీఓ కల్పన అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జీపీడీపీ గ్రామసభలపై ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామసభల కోసం గ్రామాల్లో టాంటాం వేయించాలన్నారు. ప్రజలు, అన్ని శాఖల అధికారులు గ్రామసభలకు హాజయరయ్యే విధంగా చూడాలన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఉన్న 9 థీమ్‌లలో రెండు ఎంపిక చేసుకొని పనులు ప్రారంభించాలని చెప్పారు. ఆగిపోయిన గ్రామ పంచాయతీ భవనాలు, డ్రెయినేజీలతోపాటు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. జీపీ నిధులు సరిపోను లేకపోతే మండల పరిషత్‌కు.. అక్కడ నుంచి జిల్లా పరిషత్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ ఆర్థిక నిధుల నుంచి ఇష్టానుసారంగా వాడుకోవద్దన్నారు. పనిని బట్టి ఆన్‌లైన్ చేసి నిధులు వాడుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సర్పంచ్‌ల పదవికాలం కొద్ది రోజులలో ముగిస్తుండటంతో గ్రామసభల ద్వారా పనుల తీర్మానాలు చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ప్రజాపాలన గ్రామసభలో కూడా అభివృద్ధి పనుల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సర్పంచ్ సమ్మునాయక్, సూపరింటెండెంట్ దయాకర్, డాక్టర్ మంజీలాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



లక్ష్మీపురంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

దుగ్గొండి: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పీఆర్‌టీయూ పనిచేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేగంగా సాగేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23న రిలీవ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యూనియన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను యువత వినియోగించుకోవాలి
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: నాబార్డు ద్వారా అందించే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. రంగశాయిపేటలో గురువారం నాబార్డు సౌజన్యంతో చేపట్టే ఇత్తడి నగిషీ కళాకారుల నైపుణ్య శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. నాబార్డు సంస్థ అందిస్తున్న సహాయ సహకారాలు వరంగల్ నగిషీ కళాకారులకు ఉపయోగకరంగా ఉండడం శుభపరిణామన్నారు. ప్రాచీన ఇత్తడి నగిషీ కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈక్రమంలో రూ.23.38లక్షలతో రంగశాయిపేట ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నాబార్డు సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్టును కళాకారులు వినియోగించుకోవాలని సూచించారు. కళాకారులకు టూల్స్, మిషనరీలతోపాటు ఉత్పత్తులను తయారు చేసే పరికరాలు అందిస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో తయారు చేసే వస్తువులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా మెళకువలు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాచీన ఇత్తడి నగిషీ కళాకారులు తయారు చేసిన గృహోపకరణ, దేవాలయాల చిత్రాల ప్రతిమలను కలెక్టర్ వీక్షించి అభినందించారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం సుశీల, ఏజీఎం చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, హ్యాండ్‌క్రాఫ్ట్ అధికారి ప్రవీణ్‌కుమార్, మారి సంస్థ వైస్ చైర్మన్ హేమనళిని, సొసైటీ అధ్యక్షుడు మారపాక వెంకట్, కళాకారుల సొసైటీ అధ్యక్షుడు ప్రణయ్‌కుమార్, కళాకారులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి: రైతులు వరి, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతనెక్కొండ, రావూరు గ్రామాల్లో గురువారం వరి, మొక్కజొన్న పంటల క్షేత్ర సందర్శన చేపట్టారు. ఎకరాకు ఎనిమిది లింగాకర్షక బుట్టలను అమర్చాలన్నారు. బుట్టల్లో 25నుంచి 30మగరెక్కల పురుగులు వారానికి గమనిస్తే నష్టపరిచే స్థాయిగా పరిగణించాలన్నారు. 20నుంచి 25రోజుల దశలో క్లోరంట్రానిలీ ప్రోల్ 4జి గుళికలు–నాలుగు కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రాక్లోరైడ్ ఫోర్ జి గుళికలు–8కిలోలు ఎకరాకు సమానంగా ఇసుకలో కలుపుకొని పల్చగా నీరు ఉంచుకొని కలిసే విధంగా పిలక దశలో చల్లుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మొదటి దశలో వేపనూనె 5మి.లీ లేదా ఇమామ్యాక్టిన్ బెంజోయేట్(ఫ్లోక్లేమ్) 0.4గ్రా లేదా స్పైనోసాడ్(ట్రేసర్) 0.3మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్(కోరాజెన్) 0.3 మి.లీ. లీటరు నీరు చొప్పున కలుపుకొని మొగిలోపల, సుడిలో పడే విధంగా పిచికారీ చేసి పురుగును అరికట్టాలన్నారు. విషపు ఎరను తయారు చేసుకొని సుడిలో వేసుకోవాలి. ఎకరానికి 10కిలోల తౌడు, రెండు కిలోల బెల్లం తీసుకొని బెల్లంను 2, 3మీటర్ల నీటిలో కరిగించి, తర్వాత తౌడులో కలిపి మిశ్రమాన్ని 24గంటలు పులియనిచ్చి అరగంట ముందు ఈ మిశ్రమాన్ని 100గ్రాముల థయోడిఆర్బ్(లార్విన్) కలిపి మొక్క సుడిలో వేస్తే కత్తెర పురుగును అరికట్టవచ్చని తెలిపారు.

వేరుశనగ పంట పరిశీలన
ఖిలా వరంగల్: వసంతాపురం, స్తంభంపెల్లి, దూపకుంట గ్రామాల్లో వేరు శనగ పంటలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సందర్శించారు. వేరుశనగలో ఆకు ముడత పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 500 మిల్లి లేదా ఏసీఫేట్ 300గ్రాములు, 200లీటర్ల నీటి చొప్పున కలుపుకుని ఎకరాకు పిచికారీ చేయాలని, పొగాకు లద్దె పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 40 ఎం.ఎల్. ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరి తవుడు 5కిలోలు, బెల్లం అరకిలో, మోనోక్రోటోఫాస్ 500 ఎంఎల్ చొప్పున ఎకరాకు కలుపుకుని సాయంత్రం పొలంలో చల్లుకోవాలి. వేరుశనగలో కలుపు నివారణ, వేరుశనగ విత్తిన 20 నుంచి 25రోజులకు ఇమాజితా ఫైర్, ఇమాజాక్స్(ఓడీ ఎస్పీ) 100గ్రాములు, ఇమాజితా ఫైర్ 250 మి.లి క్విజాల్‌ఫాఫ్ ఈథైల్ 350 మిల్లి ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. అధికారులు సారంగం, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, విజ్ఞాన్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల నగారా..
- రేపు షెడ్యూల్
- 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక



ఎన్నిక ఇలా..

కాశీబుగ్గ: విద్యాలయాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)లను ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఎస్‌ఎంసీల గడువు ముగియడంతో నూతన కమిటీల ఏర్పాటుకు ఈనెల 29న అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో (ప్రభుత్వ, లోకల్ బాడీ, సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్) ఎస్‌ఎంసీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్నికల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అవకాశం కల్పిస్తారు. ఈ ఎన్నికలను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఎన్నికలకు 50 శాతం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు హాజరై కోరం ఉండేలా చూసుకోవాలి. ఎన్నికలు చేయొత్తే ప్రక్రియ లేదా.. వాయిస్ ఓటు ద్వారా నిర్వహించొచ్చు.

ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున , ఉన్నత పాఠశాలల్లో 6వ నుంచి 8వ తరగతి వరకు ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఎన్నుకోబడతారు. ప్రతి కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, మెంబర్ కన్వీనర్(అఫిషియో మెంబర్), ఎలక్టెడ్ మెంబర్స్, ఎక్స్ అఫిషియో మెంబర్స్ ఉంటారు. కమిటీ కాలవ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుంది.

ఈనెల 20న షెడ్యూల్
ఈనెల 20న ఎస్‌ఎంసీ ఎన్నిక నోటిఫికేషన్, 22న, 23న అభ్యంతరాల స్వీకరణ, 24 విద్యార్థుల తుది జాబితా ప్రదర్శన29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నిక నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్



ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీల గడువు ముగియడంతో నూతన కమిటీలను ఎన్నుకోవడానికి ప్రభుత్వం గురువారం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ ఈనెల 20న ప్రారంభిస్తాం. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ప్రక్రియ అమలు చేస్తారు.
– వాసంతి, డీఈఓ

రైతు సంఘాలు బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుశీల

నెక్కొండ: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలని నాబార్డు సీజీఎం చింతల సుశీల అన్నారు. మండలంలోని వెంకటాపురంలో గురువారం నాబార్డు సహకారంతో 'సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ' ఆధ్వర్యంలో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆమె సందర్శించి, మాట్లాడారు. సంఘం రైతులు నాణ్యమైన పసుపు దిగుబడులు సాధించి, మార్కెటింగ్ ఎక్స్‌పోర్ట్ చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారని తెలిపారు. మహిళా రైతులు సైతం సంఘాలుగా ఏర్పడితే 50 శాతం భాగస్వామ్యాన్ని కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీజీఎం శ్రీనివాస్, డీడీఎం చంద్రశేఖర్, సర్పంచ్ కుమార్, సంఘం చైర్మన్ జలగం విజయకృష్ణారావు, డైరెక్టర్లు యాసం కుమారస్వామి, బోళ్ల భూపాల్, కదిరి వీరన కొండపల్లి శోభనరేందర్, తొగరు యాకయ్య, బాలరాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

విధేయతకు పట్టం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్
- కొండేటి శ్రీధర్ స్థానంలో నియామకం
- వరంగల్ పార్లమెంట్ స్థానంపై కమలం పార్టీ దృష్టి



సాక్షి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అనూహ్యంగా వరంగల్ బీజేపీ అధ్యక్షున్ని మారుస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన వరంగల్ ఎంపీ స్థానం ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్న కమలం పార్టీ వరంగల్‌భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా గంటా రవికుమార్‌ను నియమించింది. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ స్థానంలో గంట రవి కుమార్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

గంటా రవి నేపథ్యం
ఆజంజాహి మిల్లులో ఉద్యోగిగా పనిచేసిన కిష్టయ్య ఐదుగురు కుమారుల్లో ఒకరైన గంటా రవి ఎంసీఏ, ఎల్ఎల్‌బీ చదివారు. సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్‌తో సుపరిచితులైన గంటా రవి గత బల్దియా ఎన్నికల్లో 19వ డివిజన్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన ఆయన మూడున్నరేళ్ల నుంచి ఆ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఇటీవల జరిగిన అ సెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి బీజేపీ అభ్యర్థిగా టికెట్ ఆశించినా.. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ను అధిష్టానం ఖరారు చేసింది. దీంతో పార్టీ విధేయుడిగా ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో ప్రచారం చేశారు. ఆయన కష్టాన్ని గుర్తించిన జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో రవి అనుచరులు, బీజేపీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానంలో గెలవాలనుకుంటున్న బీజేపీని విజయతీరాలకు చేర్చే బాధ్యత గంటా రవి ముందున్న పెద్ద సవాల్ అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో జరిగింది. ఎస్సై రాణాప్రతాప్ కథనం ప్రకారం మండలంలోని నాయక్‌పల్లికి చెందిన బుర్రి ఉప్పలయ్య (56) బుధవారం మండలంలోని గుండెంగలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. అనంతరం రాత్రి ద్విచక్రవాహనంపై నాయక్‌పల్లికి వస్తున్న క్రమంలో అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున ఆ దారి వెంట వస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. ఉప్పలయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు రాజు ఉన్నాడు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.10 లక్షలు పోగొట్టుకున్న రైల్వే ఉద్యోగి

కాజీపేట: ఆన్‌లైన్ గేమ్‌కు ఆకర్షితుడైన ఓ రైల్వే ఉద్యోగి.. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.10 లక్షలు పోగొట్టుకున్నారు. కాజీపేట పట్టణంలోని రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేసే రాజస్థాన్‌కు చెందిన లోకేష్ ఖాళీ సమయంలో తరుచూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతాడు. సైబర్ నేరగాళ్లు మొదట రూ.5 లక్షల వరకు డబ్బులు గెల్చుకునేలా నమ్మించారు. దీంతో ఈ ఆట సులువుగా ఉందని, ఇలాగే కొనసాగితే మరిన్ని లక్షలు రావడం ఖాయమని నమ్మిన లోకేష్.. ఆట కొనసాగించాడు. మొదట నమ్మించి ముగ్గులోకి దింపిన సైబర్ నేరగాళ్లు.. లోకేష్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 10 లక్షలు, గెల్చుకున్న రూ.5 లక్షలు కాజేసి ఆన్‌లైన్ నుంచి మాయమయ్యారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పూర్తిగా పోయినట్లు ఆలస్యంగా గుర్తించిన లోకేష్ లబోదిబోమంటూ 1930కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్నేహితుల సూచన మేరకు గురువారం కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్రమత్తతే 'శ్రీరామ'రక్ష..

రాముడినీ వదలని సైబర్ నేరగాళ్లు

- అయోధ్య రామమందిరానికి విరాళాలంటూ నకిలీ క్యూఆర్ కోడ్‌లు
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పేరుతోనూ ఫేక్ వెబ్‌సైట్లు
- ఆలయ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు
- వివిధ రూపాల్లో భక్తుల నుంచి క్యాష్ చేసుకుంటున్న మోసగాళ్లు..
- అనుమానాస్పద లింక్‌లు, క్యూఆర్ కోడ్‌ల జోలికి వెళ్లొద్దంటున్న పోలీసులు



సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్ల మోసాలకు అంతే ఉండడం లేదు. బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరిట సెల్‌ఫోన్లకు లింక్‌లు పంపుతున్నారు. ఈ విషయం తెలియని అమాయకులు వాటిని ఓపెన్ చేస్తున్నారు. దీంతో క్షణాల్లో తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అవుతోంది. అయితే తరహా మోసాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో కొంతమేర మార్పువచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చారు. ప్రస్తుతం రామమందిర అంశాన్ని వినియోగించుకుంటున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం కోసం వేయికండ్లతో వేచి చూస్తున్న భక్తులకు శఠగోపం పెట్టే కార్యక్రమానికి సైబర్ నేరగాళ్లు తెరలేపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు కావాలంటూ కొందరు.. అక్కడికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీకి విరాళాలు కావాలంటూ ఇంకొందరు నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కొందరు భక్తులు ఇది నిజమని నమ్ముతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే, అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు ఉన్నాయంటూ సెల్‌ఫోన్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏదేమైనా భక్తిని క్యాష్ చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా నేరాలకు తెరలేపిన నేపథ్యంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ కమిషనరేట్ పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని రోజులు ఫోన్లు, వాట్సాప్‌ల్లో సందేశాలు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించి...

అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ట ఈ నెల 22న జరగనుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమం కొనసాగింది. ఒకటి నుంచి 15 వరకు ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందజేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఇది జరగడంతో పాటు ప్రధాని మోదీ అయోధ్యను సందర్శించడం, ఈ నెల 22న అంగరంగ వైభవంగా జరుగుతుందని విస్తృత ప్రచారం రావడంతో మరికొందరు సైబర్ నేరగాళ్లు మిగతా ఆలయ పనులు త్వరగా పూర్తయ్యేందుకు విరాళాలు అవసరమని నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించారు. ఆలయ నిర్మాణానికి తమకు తోచిన సాయం చేయాలని భక్తులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల కోసం వెతుకుతుండడాన్ని దృష్టిలో ఉంచుకుని 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు' పేరుతో నకిలీ వెబ్ సైట్లు రూపొందించారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ నకిలీ సైట్లతో పాటు సైబర్ నేరగాళ్లు పంపించే లింక్‌లను తెరవొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ లింక్‌ల వల్ల ఖాతాల్లోని డబ్బులు కొల్లగొట్టడంతో పాటు ఆయా మొబైల్ ఫోన్‌లలో ఉన్న వ్యక్తిగత సమాచారం కూడా తస్కరణకు గురయ్యే అవకాశముందని, ఆ సెల్ ఫోన్‌కు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. ఎక్కడైనా ఎవరైనా మోసపోతే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

నకిలీ యూపీఐ ఐడీలు ఇలా..

ఇప్పటికే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు.. విరాళాల కోసం శ్రీరామ్ జన్మభూమి పేరుతో ఎస్‌బీఐ వివరాలతో కూడిన యూపీఐ ఐడీ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచింది. దీనికి దగ్గరి పోలికలతోనే కొంతమంది నకిలీ యూపీఐ ఐడీలను అదే ఎస్‌బీఐ ఖాతాలో ఓపెన్ చేసి వాట్సాప్‌ల్లో విరాళాలు ఇవ్వాలంటూ పంపుతున్నారు. ఇలా shriramjanambhomi@sbi, sriramjanambhoomi@sbi, shriramjanambhumi@sbi, sriramjanmbhoomi@sbi, sriramjanmbhumi@sbi... నకిలీ యూపీఐ ఐడీలు సృష్టించారని ఇప్పటికే అన్సుల్ అనే వ్యక్తి ట్విటర్ వేదికగా ఎస్‌బీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఐడీలు ప్రైవేట్ వ్యక్తులు పేరు మీద ఉన్నాయని తెలిపారు.

ప్రజల్లోకి బాలవికాస పథకాలు..



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- బాలవికాస ప్రాంగణంలో నీటి శుద్ధికరణ మహాసభలు ప్రారంభం

కాజీపేట రూరల్: సమాజంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ప్రాంగణంలో గురువారం ప్రారంభమైన నీటి శుద్ధికరణ పథకాల సుస్థిరతలో 'గ్రామ పంచాయతీ-కమిటీల పాత్ర' అనే అంశంపై 1500 వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులతో నిర్వహించిన మహాసభలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం చేపట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందన్నారు. మహిళా పథకాలు, లీడర్‌షిప్ క్వాలిటీ, చెరువు పూడికతీత, అనాథ పిల్లలు, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. నూతన పథకాలకు కేరాఫ్.. ప్రభుత్వాలకు దీటుగా బాలవికాస సేవలు ఆదర్శనీయమన్నారు. వితంతు విముక్తి ఉద్యమం ద్వారా మూఢనమ్మకాలను పారద్రోలడంలో బాలవికాస చేస్తున్న అభినందనీయమన్నారు. బాలవికాస ఫౌండర్, సభాధ్యక్షురాలు బాలతెరిసా మాట్లాడుతూ 47 ఏళ్ల నుంచి కెనడా సోఫార్ సంస్థ అనుబంధంతో బాలవికాస సంస్థ ప్రజలకు సేవలు అందిస్తూ ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలవికాస సేవలు రైతుల నుంచి నిరుద్యోగుల వరకు అండగా ఉంటాయన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో విస్తరించిన నీటి శుద్ధీకరణ కమిటీలు నిత్యం వాటర్ ప్లాంట్లను పర్యవేక్షించాలన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేదం లింగమూర్తి మాట్లాడారు. కాగా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వాటర్ ప్లాంట్ల అధ్యక్ష, కమిటీ మెంబర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సోఫార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మల్రెడ్డి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మల్రెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, పీడీటీసీ డైరెక్టర్ సునీతారెడ్డి, సీనియర్ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లత, మంజుల, ప్రాన్సిస్‌రెడ్డి, తిరుపతి, శోభ, శివరాం, మొగిలి, విజేందర్, మోసిన్, జాన్‌పాల్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ. 7లక్షల నగదు అపహరణ
- నర్సంపేటలో ఘటన



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవి కుమార్

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు రూ. 7లక్షలు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండకు చెందిన మొల్గూరి నాగేందర్ కొంత కాలంగా నర్సంపేట పట్టణం సర్వాపురం శివారులోని సాయి నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. నాగేందర్ జాతరల్లో జాయింట్ వీల్స్ నడిపిస్తుంటాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం కుటుంబ సమేతంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ జాతరకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లే సరికి వెనుక గది తాళం పగలగొట్టి ఉంది. గదిలోని వస్తువులనీ చిందరవందరగా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి చూడగా ఇంట్లో భద్రపరిచిన రూ.7లక్షలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నర్సంపేట టౌన్ సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. దీనిపై ఎస్సై రవి వివరణ కోరగా నాగేందర్ ఇంట్లో చోరీ జరిగింది వాస్తవమేనని, రూ. 7లక్షలు అపహరణకు గురయ్యాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మార్కెట్ కార్యదర్శిపై విచారణ పెండింగ్

- బిజీతో వాయిదా వేసిన డీడీఎం
- త్వరలో విచారణ తేదీ ప్రకటన

వరంగల్: ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన రాహుల్‌పై వచ్చిన ఆరోపణలపై చేపట్టిన విచారణ వాయిదా పడింది. వరంగల్ బాలాజీ నగర్‌కు చెందిన మహేష్.. రాహుల్‌పై పలు ఆరోపణలు చేస్తూ గతేడాది అక్టోబర్ 4వ తేదీన మార్కెటింగ్‌శాఖ అడిషనల్ సెక్రటరీ ఎల్.సరితారాణికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అడిషనల్ సెక్రటరీ అదే నెల 5వ తేదీన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక అందించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి వరంగల్ ఆర్‌డీడీఎం అజ్మీరా రాజునాయక్‌ను ఆదేశించారు. ఆర్‌డీడీఎం రాజు నాయక్ 2024 జనవరి 19వ తేదీన మార్కెట్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఫిర్యాదుదారుడు మహేష్‌తో పాటు మార్కెట్ సెక్రటరీ రాహుల్‌కు గత నెల 28వ తేదీన నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదుదారుడు మహేష్ అడ్రస్ పేరు పేర్కొనకపోవడం, అందులో ఒక వ్యాపారి సెల్ నంబర్ ఉండడంతో సదరు వ్యాపారికి నోటీసులు అందజేసినట్లు తెలిసింది.

విచారణ తేదీ ప్రకటిస్తాం

మార్కెట్ కార్యదర్శి రాహుల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాఖ పరంగా విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 19వ తేదీన ఫిర్యాదుదారుడు, కార్యదర్శి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చాం. మిర్చి ధరలు పడిపోవడంతో మార్కెట్‌లను సందర్శించే బిజీలో ఉన్నాం. దీంతో విచారణ వాయిదా వేశాం. విచారణ తేదీని త్వరలో ప్రకటిస్తాం. **–రాజు నాయక్, ఆర్‌డీడీఎం**

రాహుల్‌పై ఆరోపణలు..

రాహుల్.. వరంగల్ గ్రేయిన్ మార్కెట్‌లోని అడ్తి వ్యాపారులకు ఇచ్చిన గదులకు అద్దెలు పెంచినట్లు నోటీసులు ఇచ్చి అడ్తిదారులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు కమీషన్ రూపంలో తీసుకున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు, అడ్తిదారులు కలసి కాటన్ జీరో వ్యాపారం చేసి డబ్బులు దండుకున్నట్లు ఆరోపించారు. అదే విధంగా ఏనుమాములలో ఉన్న ఎకరం భూమిని చాంబర్‌కు అతి తక్కువ ధర అద్దెకు అప్పజెప్పేందుకు బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపించారు. వ్యాపారులతో చేతులు కలిపి ఏనుమాముల మార్కెట్‌లో ఈ-నామ్ అమలు చేయకుండా లోపాయికారీ ఒప్పందం చేసుకుని జీరో పెద్ద ఎత్తున సాగేందుకు సహకారం అందించినట్లు ఆరోపించారు. అడ్తి లైసెన్సుల్లో సైతం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, కూరగాయల మార్కెట్‌లో షాపుల కేటాయింపుల్లో చేతి వాటం ప్రదర్శించారని ఆరోపించారు. 'ఏదీ చెప్పినా అన్నింటికి డైరెక్టర్ మేడంతో మాట్లాడాను అనుమతి ఉంది. నాకేం కాదు అంటున్నాడని' ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి





బాలుర విభాగంలో గెలుపొందిన వరంగల్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి , బహుమతి అందుకుంటున్న వరంగల్ బాలికల జట్టు

క్రీడల అభివృద్ధికి సహకారం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ముగిసిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

జనగామ: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు పోటీలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పాఠశాల చుట్టూ పెన్సింగ్ నిర్మాణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన అనంతరం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు.. ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందించారు. కాగా, దేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యం తెలుపుతూ నృత్య ప్రదర్శన చేసిన చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పల్లా

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే ..

నిత్యం రాజకీయ కార్యకలాపాలతో బిజీగా గడిపే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండర్-14 కబడ్డీ రాష్ట్ర స్థాయి ముగింపు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

గెలుపొందిన జట్లు ఇవే..

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలో వరంగల్ జిల్లా (ప్రథమం), నల్లగొండ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా (తృతీయ), బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా(ప్రథమం), వరంగల్ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా(తృతీయ) స్థానంలో నిలిచాయి. ఇందులో జాతీయ స్థాయికి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఏపీలోని కడపలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలుర జట్టు పాల్గొంటుంది. అలాగే, ఈ నెల 24 నుంచి 28 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలిక జట్టు పాల్గొంటుంది.

మహిళ ఆత్మహత్య

జనగామ రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాకు చెందిన కర్రె మల్లేశ్ ట్రావెల్స్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో మల్లేశ్ భార్య అంబిక (28) గతంలో తన పిల్లలకు బంగారం కావాలని తండ్రిని కోరింది. అయితే సంక్రాంతి పండుగకు పుట్టింటికి వెళ్లగా తండ్రి బంగారం విషయం చెప్పలేదు. దీంతో మనస్తాపం చెందిన అంబిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడల్లో తలపడుతున్న క్రీడాకారులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అంబేడ్కర్ స్టేడియంలో కోల్‌ఇండియా హాకీ పోటీలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పనిచేస్తున్న కార్మికులకు క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలోని అంబేడ్కర్ స్టేడియంలో గురువారం కోల్ ఇండియా హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు సింగరేణి డైరెక్టర్ ఎస్వీకే శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల్లో మానసిక ఉత్తేజం నింపేందుకు క్రీడలు నిర్వహిస్తున్న సింగరేణి, కోల్ ఇండియా యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపు కోసం మరోసారి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు బసవయ్య, రమేష్, వెంకటయ్య, రాజ్‌కుమార్, ధర్మపురి, తుకారాం, కిరణ్‌కుమార్, పాల్గొన్నారు. కాగా, ఈ పోటీల్లో మొదట ఎస్‌సీసీఎల్ (తెలంగాణ) ఎంసీఎల్ (ఒడిశా) జట్లు తలపడగా ఎస్‌సీసీఎల్ జట్టు 2 గోల్ తేడాతో గెలిచింది. అనంతరం డబ్ల్యూసీఎల్(మహారాష్ట్ర, ఎన్‌సీఎల్ (మధ్య ప్రదేశ్)జట్లు తలపడగా గోల్ తేడాతో ఎన్‌సీఎల్ జట్టు గెలుపొందింది.

వివాహిత అదృశ్యం



షేక్ మహబూబ్‌బీ

ఐనవోలు: ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జగన్నాథపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బీ తన తల్లిదండ్రులతో కలిసి ఐనవోలు జాతరలో రింగుల దుకాణం ఏర్పాటు చేయడానికి ఈ 17వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు మండల కేంద్రానికి చేరుకుంది. తర్వాత కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. షేక్ మహబూబ్ బీ ఆచూకీ తెలిసిన వారు 8712685030, 8712685244 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

దాతలు దయచూపండి..

- తండ్రి, కుమారులకు కేన్సర్ వ్యాధి
- చికిత్సకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు
- సాయం చేయాలని వేడుకోలు

దీన గాథ



భార్య, ఇద్దరు కుమారులతో వేణుమాధవ్(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన మాదారపు వేణుమాధవ్, అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వేణుమాధవ్, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు. వేణుమాధవ్‌కు కొంత కాలం క్రితం దవడ కేన్సర్ రాగా పలు ఆస్పత్రుల్లో సుమారు రూ. 20 లక్షల మేర ఖర్చు చేసి చికిత్స చేయించుకుని కోలుకుంటున్నాడు. అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరీక్షలు చేయించగా అతడికి బ్లడ్ కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి రోజు చికిత్సలు చేయించాలంటే రూ. వేలలో ఖర్చు అవుతుండడంతో వారి కుటుంబం ఆర్థికంగా దీనస్థితికి చేరింది. తమ కుమారుడి చికిత్స కోసం రూ. 50 లక్షల మేర ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని, అంతటి స్తోమత తమకు లేదని, వైద్యం కోసం సాయం అందించాలని తల్లి సునీత వేడుకుంటోంది.

సాయం చేసే వారు 90146 74308 నంబర్‌కు గూగుల్ లేదా ఫోన్‌పే చేయాలని బాధితులు కోరుతున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

వాజేడు: లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 18 వేల జరిమానా విధిస్తూ ములుగు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి లలిత శివ జ్యోతి గురువారం తీర్పు వెలువరించారు. ములుగు కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ కమలాకర్ కథనం ప్రకారం వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం భూపతిరావు 2021 సంవత్సరంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సత్యనారాయణ బాధితుల పక్షాన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు భూపతిరావుకు 10 ఏళ్ల కారాగార శిక్ష, రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వరకట్నం కేసులో మరో వ్యక్తికి మూడేళ్లు..

నర్సింహులపేట: వరకట్న వేధింపుల కేసులో మండలంలోని పడమటిగూడేనికి చెందిన కొండ రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత గురువారం తీర్పు వెలువరించారు. వరకట్న వేధింపుల ఘటనపై 2014లో తేజస్విని తన భర్త రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టిన అనంతరం కోర్టులో హాజరుపర్చగా రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని ఎస్సై గంధ్రాతి సతీష్ తెలిపారు.